# త్రీఇన్ వన్

"ఇంక ఆలోచించకండి మేడమ్! ఇది నిజంగా మంచి నిర్ణయం" రేవతి నవ్వేసింది.

"థాంక్యూ ఆనంద్. నేనూ అదే అనుకొంటున్నాను. ఇప్పుడీ ట్రాన్స్‌ఫర్ వల్ల నాకు పర్సనల్‌గా చాలా ఇబ్బందులున్నాయి. ఎదురుగా ఉన్న ఆఫర్ కూడా కొట్టిపారెయ్యదగ్గదిగా లేదు. అయితే పూర్తిగా సేల్స్, మార్కెటింగ్ కనుక కాస్త జాగ్రత్తగా డీల్ చేస్తే సరిపోతుందనుకుంటున్నా..."

"నేనూ అదే చెపుతున్నా మేడమ్. అది చాలా మంచి కంపెనీ. రిటర్న్స్ కూడా చాలా బావుంటాయి"

రేవతి తలపూపింది.

ఆనంద్ లేచి నిలబడ్డాడు.

"ఎనీవే. ఆల్‌ది బెస్ట్ మేడమ్. నెక్స్ట్ వీక్ మళ్ళీ కలుస్తాను మిమ్మల్ని. ఈ వారం అంతా కేంప్‌లో ఉంటాను. అయితే మీరు లేని ఆఫీస్ ఊహించేందుకే భయంగా ఉంది. కానీ మీకు

మంచి ఫ్లేవర్ '' అంటూ ఆనంద్ వెళ్ళిపోయాడు.

రేవతి తిప్పి వదిలిన పేపర్ వెయిట్ గుండ్రంగా తిరుగుతోంది టేబుల్ మీద. ఎలెక్స్ మిషన్ సవ్వడి చేస్తోంది. ఎనిమిదేళ్ళుగా అలవాటైన ఆఫీస్‌రూమ్. విశాలంగా, అందంగా, చల్లగా తన పనికి వీలుగా. రేపటి నుంచి తనకు ఇలా ఈ రూమ్‌లో ఒక్కతే కూర్చుని బిల్లులు రాసే పని ఉండదు. ఇంతకంటే పెద్ద కార్పొరేట్ ఆఫీసులో ఒక పెద్ద అడ్మినిస్ట్రేషన్ తన అరచేతిలో. రేవతి పెదవులు చిరునవ్వుతో విచ్చుకున్నాయి. చేతులు విశాలంగాచాపి వొళ్ళు విరుచుకుంది. అద్దాల్లోంచి, పక్కనే ఉన్న ప్యాకింగ్ డివిజన్ కనిపిస్తోంది. చివరగా గోడపక్క టేబుల్ దగ్గర నిలబడి రత్తమ్మగారు చకచకా ప్యాడ్స్ కత్తిరిస్తోంది. అంతపెద్దావిడ చేతులు ఎంత చురుగ్గా పనిచేస్తున్నాయో. ఆడవాళ్ళ చేతుల్లో ఎంత చురుకుతనం ఉంటుందీ!

ఎస్. ఇట్స్ ఎ ఛాలెంజ్ ఫర్ మి...

రక్తదానం చేస్తే కొత్త రక్తం పట్టి మరింత ఆరోగ్యం సమకూరినట్టు కొత్తకొత్త పరిచయాలు, విస్తరించే జీవితం రియల్లీ ఇట్స్ ఎ ఛేంజ్...''

రేవతి సొరుగులోంచి పర్స్ తీసి సొరుగు తాళం వేసి, తాళాలు టేబుల్ మీద ఉంచేసి బయటికి వచ్చేసింది. బయట చల్లగా ఉంది. వర్షం వచ్చేలా ఉంది. రేవతికి ఉత్సాహం పొంగి వస్తోంది. నాలుగు రోజులుగా మనసులో ఒక్కటే బెంగ. అది కాస్తా పోయింది. ఇక పాపాయిని తీసుకొని తను ఒక్కతే వేరే వూర్లో కాలక్షేపం చేయనక్కర్లేదు. హాయిగా తనూ, చంద్రం, పాపాయి... చల్లని గాలి బుగ్గలను తాకుతూ సంతోషం పంచుకుంటోందనిపించింది రేవతికి.

'తన కొత్త ఉద్యోగం. గబగబా ఎక్కగల మెట్లు. మంచి జీతం... అన్నట్టు చాలా తొందరలో తమకు మంచి ఇల్లు...

★ ★ ★

''కొంపతీసి ఈ ముక్క అందరితో అనలేదు కదా?''

రేవతి ముఖం చిట్లించుకుంది.

''అంటే రేపు ఉదయం ఆఫీసుకు వెళ్ళకపోతే తెలియదా? వెళ్ళి రిజైన్ చేయనా?''

'' అదే చెపుతుంటా! ఊరకే వెర్రిమొర్రి ఆలోచనలు చేయకు. రేపు మామూలుగా ఆఫీసుకు వెళ్ళు. లేనిపోని ఆలోచనలు పెట్టుకోకు ''

''అదే ఎందుకు అని అడుగుతున్నా ''

''ఊరికే ప్రశ్నలు వేయకు. సుఖమైన ఉద్యోగం వదులుకొని...''

''ఎవరికి సుఖమైన... ట్రాన్స్‌ఫరై పక్క వూరికి పోవటం, నేనొక్కదాన్నీ పడి వుండటమూ, సుఖమా''

చంద్రం మొహం ఎర్రబడింది. చేతిలో ఉన్న పేపర్ విసిరికొట్టి...

''నీకు సమాధానం చెప్పటం నా వల్ల కాదు. ఇష్టం వచ్చినట్లు చేసుకో''

''అరే ఇందులో నీకింత ఆవేశం ఎందుకు వస్తోందీ. ట్రాన్స్‌ఫర్ వద్దనుకొంటే ఇంక్రిమెంట్ వదులుకోవాలి. జీవితమంతా ఆ కాబిన్‌లోపడి ఏడవాలీ. ఇదీ మంచి జాబేగా...''

''స్టుపిడ్... ఏమిటేమంచి జాబూ. మర్యాదగా నీ రూమ్‌లో కూర్చుని ఎవరికీ సంబంధం లేకుండా, ఒక్కడూ నీ జోలికి రాకుండా, నీ పని నీవు చేసుకుపోవటం మానేసి... ఇక ప్రపంచం జయించుకొస్తావా? ఇంక్రిమెంట్లు, ప్రమోషన్లూ లేకపోతే కొంప కొల్లేరవుతుందా?''

''క్రితం సంవత్సరం ఒక్క ఇంక్రిమెంటు ఆపేసిందని, మీ కంపెనీ మీద స్ట్రయిక్ ప్రకటించలేదా మీరు...''

''అది వేరూ... ఇది వేరూ... మనకిందులో జాబ్ శాటిస్‌ఫాక్షన్ ఉంది. బయటికి అడుగుపెట్టే పనిలేదు. మర్యాదగా బతకొచ్చు''

ఇన్నాళ్ళు నుంచి మర్యాదగా బతకటమంటే ఇంకో మగాడి మొహం చూసే అవకాశం నాకు లేదు గనక అంతేనా? నా పాతివ్రత్యానికి భంగం లేకుండా ఉంటుంది కనుక అవునా?...

చంద్రం కంపరంగా చూశాడు రేవతి వంక...

''నీకు ఆ మగాళ్ళ మధ్యబడి ఉద్యోగం వెలగబెట్టాలని వున్నట్లుంది ఛీ...''

చంద్రం విసురుగా అక్కడ నుంచి కదిలి, షర్ట్ తగిలించుకొని కోపంగా గది తలుపులు ఈడ్చివేసి బయటికి వెళ్ళిపోయాడు. ఆ శబ్దం గుండెల మీద తగిలినట్లయింది రేవతికి. శబ్దానికి ఉయ్యాల్లో పాపాయి కెవ్వుమంది. నిద్రలో ఉలిక్కి పడిన పాపాయిని చిచ్చి కొట్టింది. ఎనిమిది నెలల పాపాయి. తెల్లగా బొద్దుగా అందంగా. చంద్రానికి ప్రతిరూపం అనుకునే పాపాయి ఇవ్వాళ మొదటిసారిగా చంద్రం పోలికలు కన్పించక, అందమైన పాపాయిగా మాత్రమే కనిపించింది రేవతికి. 'అంతా మనం ఊహించుకోవటంలోనే ఉంది'

నిద్రలో లేచిన పాపాయి శాంతపడి నిద్రలోకి జారుకొంది. ఉయ్యాల కదలిపోకుండా కాళ్ళతో స్టాండ్ తొక్కిపట్టి పాపాయికి నిద్రాభంగం కలుగకుండా నెమ్మదిగా ఉయ్యాల జోరు తగ్గించింది రేవతి. ఈ పనులన్నీ తనకు పుట్టినప్పటినుంచీ అలవాటున్నాయా? పాపాయి పుట్టాక, పెరుగుతున్న కొద్దీ తన చేతుల స్పర్శ, తనసేవ దానికి అర్థం అయ్యాక అది ఎలా

అయితే స్వేచ్ఛగా ఉండగలదో, సౌకర్యంగా ఉంటుందో రోజురోజుకి తను తెలుసుకొన్న విషయం అది. అంతేనా? తను తెలుసుకొన్న విషయాలు ఎన్నెన్నో. పరుగులు పెట్టే దూకుడు తగ్గించి, నడవటమూ, అమ్మా నాయనమ్మల పర్యవేక్షణలో ఆడపిల్లగా రూపాంతరం చెందటమూ, వాళ్ళ దృష్టిలో తను నెమ్మదిగా పొందికగా ఉండటమూ, కాలేజి, యూనివర్సిటీ మెట్లన్నీ ఎక్కేసి గోల్డ్‌మెడల్స్‌తో కన్నవారిని మెప్పించిన రేవతి కేవలం నమ్రతైన పిల్ల. తలవంచి తలంబ్రాలు పోయించుకొని చంద్రం చిటికెనవేలు పట్టుకొని అత్తారింటి గడప తొక్కి, ఎవరినీ నొప్పించకుండా సంసారం చేసి, ఇవన్నీ తాను అనుభవంతో నేర్చినవే. ఆ అనుభవం... ఎవర్నీ నొప్పించరాదనే తారకమంత్రం పఠిస్తే వచ్చింది. ఇన్నిన్ని అనుభవాల్లో తను నొచ్చుకోలేదే. అందరినీ సంతోషపెట్టగలిగేనని సంతోషపడింది. తనకు తెలియకుండా తనను కంట్రోల్ చేయగలిగిన శక్తులన్నింటికీ తలవంచింది.

అయితే ఎప్పుడూ ఓ ఓదార్పు. తను స్వేచ్ఛాజీవి. ఉద్యోగిని. వ్యక్తిత్వం గల యువతి. ఇది లోలోపల తనను మనిషిగా నిలబెట్టిన విశ్వాసం. ఈ స్వేచ్ఛకున్న పగ్గాలు తన మెడను పట్టి లాగుతుంటే ఇప్పుడర్థమయింది రేవతికి... ఇప్పటిదాకా తనకు ఎవరి గుప్పిట్లోంచి తను బతుకుతున్న ఒక్కోరోజు వస్తోందో! తన పర్సనల్ జీవితమూ, పబ్లిక్ జీవితమూ ఎవరి కంట్రోల్లో ఉన్నాయో! పన్నెండు గంటలు కొట్టింది గడియారం. అలవాటుగా రేవతి కాళ్ళు ఆ శబ్దం వినపడగానే వంటింట్లోకి దారితీశాయి. ఇక పాపాయి లేస్తుంది. దానికి తినేందుకు ఇవ్వాలి. మెకానికల్‌గా చేతులు పనులు చేస్తున్నాయి. కాసిన్ని పప్పుగింజలు, కారెట్, బంగాళాదుంప ముక్కలు, టమోటా కలగలిపి గుప్పెడు బియ్యం పోసి కుక్కర్లో పెట్టింది. తోమి బోర్లించిన ఫిల్టర్ తీసిపెట్టి కాఫీ పొడివేసి మరిగే నీళ్ళు అందులో పోసింది. ఖాళీగా ఉన్న ఫిల్టర్ కిందికి టప్‌మని డికాక్షన్ ముక్క జారిన సవ్వడి కూడా రేవతి చురుకు చెవులు పసిగట్టాయి. రెండు నిముషాల్లో కాఫీ తాగితే బావుంటుంది. మెదడు సజెషన్ ఇస్తోంది. గబగబా పాలగిన్నె పంచదార కప్పూ దగ్గరకి తెచ్చుకొంది. ఫిల్టర్... తన కోసం ఫిల్టర్ చేసిన జీవితం... కాచి చల్లార్చి సిద్ధం చేసిన జీవితం... ఏ సైడ్ ఎఫెక్ట్సూ రాకుండా, ఏ పక్కదార్లూ తను తొక్కకుండా అతి స్వచ్ఛమైన జీవితం తన కోసం ఎవరో పేక్‌చేసి ఇస్తున్నారు. ఇదంతా తను కోరుకున్నదేనా? రేవతి తల అడ్డంగా రెండుసార్లు ఊపింది.

లేదు. తను ఎప్పుడూ ఏదీ కోరుకోలేదు. అసలు ఆలోచించలేదు. ఊరికే బతికేస్తోంది. ఎవరో గీసిన హద్దుల్లోంచి, ఇంకెవరో డిజైన్ చేసిన జీవితాన్ని ఆ గీతల మధ్యనే జాగ్రత్తగా బతుకుతోంది. ఇందులో తన గొప్పా లేదూ, ప్రమేయమూ లేదు. రేవతికి ఫిల్టర్ కాఫీ తాగాలనిపించలేదు. పాలమీద మరచిపోకుండా మూత పెడుతుంటే నవ్వొచ్చింది. ఎంత అలవాటైన జీవితం. కంప్యూటర్‌లోకి ఎక్కించిన ప్రోగ్రామ్‌లాగా అక్షరం తేడా లేకుండా

కచ్చితమైన స్టాటిస్టికల్ రిపోర్ట్.

కిటికీ దగ్గర నుంచి నెమ్మదిగా పిలుపు వినబడుతోంది. రేవతి హాల్లోకి వచ్చింది. వాసు. పాపాయికి నిద్రాభంగం కలుగుతుందని, తలుపులు గబగబా బాదటం, కాలింగ్‌బెల్ నొక్కటం మానేశారందరూ. ఇంకా అది ఎవరి కంట్రోల్లోకి రాలేదు.

తలుపు తీస్తూనే అడిగింది రేవతి.

''ఎలా వుంది తను...''

వాసు విసుగ్గా బ్రీఫ్‌కేస్ సోఫాలో విసిరాడు.

''అబ్బే మనకు కుదరదు వదినా'' అన్నాడు బూట్లు విప్పుకుంటూ.

రేవతి ఆశ్చర్యంగా చూసింది.

లలిత వంకపెట్టతగ్గ పిల్ల కాదు. ఆ అమ్మాయిని తన చిన్నప్పటి నుంచి ఎరిగుంది. వాళ్ళ అక్క రమ, తను క్లాస్‌మేట్స్. మంచి అందగత్తె లలిత. అద్భుతంగా పాడుతుంది. బాగా సంపాదిస్తుంది కూడా.

''ఏమైంది వాసూ. తను చాలా బావుంటుందే. పైగా వాళ్లందరూ నువ్వంటే ఇష్టపడ్డారు కూడా''

వాసు వదినగారి వంక కాస్త ఇబ్బందిగా చూశాడు.

''ఆ అమ్మాయి చాలా ఫాస్ట్. తన ప్రోగ్రామ్స్, ప్రెస్‌మీట్లూ అబ్బో చాలా బిజీ. ఇంత చదువుకొన్నా నీలాగా సంసార పక్షంగా లేదు...''

రేవతి ఆశ్చర్యంగా చూస్తోంది.

''నృత్యక్షేత్రలో తనకు జాబ్ వచ్చిందట. చాలా మంచి ఆఫర్. లలితకు అది ఇష్టం లేదట. అదయితే పర్‌ఫెక్ట్‌గా ఇన్ని గంటల ఉద్యోగం. తర్వాత హాబీగా... అసలు తనకు ఉద్యోగం అంటే ఇష్టం లేదట. ప్రోగ్రామ్స్ ఇస్తుంటేనే ఎంతో ఆనందంగా ఉంటుందిట. మనకెలా కుదురుతుందీ...''

''ఇందులో మనకేం ఇబ్బంది. టీమ్ మేనేజరున్నాడు. ఎప్పటినుంచో ఉన్నాడు. అంతా తనే చూసుకుంటాడే. అసలు లలితకి ఏ ప్రాబ్లమూ ఉండదు. ప్రాక్టీస్ చేసుకోవటమూ, ప్రోగ్రామ్ డిజైన్ చేసుకోవటమూ...'' వాసు తల అడ్డంగా తిప్పేడు.

''అదే వదినా. నాకు జీవితం ప్రశాంతంగా ఉండాలి. నా జాబ్ నీకు తెలుసుగా. ఎప్పుడూ

టూర్లూ, మీటింగ్‌లూ. ఇక రెండో వాళ్ళన్నా ఇల్లు చూసుకొని, కాస్త నింపాదిగా వుండే ఉద్యోగంలో వుంటే బావుంటుంది''

వాసు టవల్ తీసుకొని వెళ్ళిపోయాడు. రేవతి నెమ్మదిగా గదిలోకి వచ్చింది.

టేబుల్ మీద రాత్రి తను రాసి ఉంచిన స్లిప్ రెపరెపలాడుతోంది. ఇంట్లోకి కావలసిన వస్తువుల లిస్ట్ అది. పిన్నీస్ దగ్గర నుంచి కాఫీ పొడి దాకా. ఇన్నేళ్ళ జీవితంలో తనను ఎన్ని రకాలుగా మౌల్డ్ చేశారో తలుచుకుంటే నవ్వొస్తోంది.

నువ్వు వీధిలోకి వెళ్ళలేవు. దుమ్ము నీకు పడదు. షాపింగ్ నీకు కుదరదు. బ్యాంక్ పనులు నీకు కష్టం. హాయిగా రెస్ట్ తీసుకో. వి.సి.ఆర్.లో కేసెట్ వేసుకో. ఆదివారం వెధవ ప్రోగ్రామ్‌లు, ఫ్రెండ్స్ ఇళ్ళకు పోవటం పెట్టుకోకు. హాయిగా ఇల్లు సర్దుకో. గుడ్డలకు గంజి పెట్టుకో, శుభ్రంగా వండుకు తిందాం. వారం అలసట తీరిపోయేలా విశ్రాంతి తీసుకొందాం!

కానీ అసలు విశ్రాంతి తీసుకొనేది ఎవరు? సర్దుకుని, వండుకొని, పిల్లను క్రెచ్‌లో వదలకుండా రోజల్లా చూసుకుని వర్కింగ్ డే కంటే ఎక్కువ స్ట్రెయిన్ అయ్యేది ఆదివారం రోజునే. తనకు దొరికే విశ్రాంతి అదే... ఆఫీస్‌కి, ఇంటికీ తప్ప, చంద్రం వెనక బైక్ మీద కూర్చొని సినిమాలకూ, మార్కెట్‌కూ వెళ్ళటం తప్ప రెండో వీధి సంగతి తను ఎరుగునా?

రేవతి స్లిప్ తీసి డస్ట్‌బిన్‌లో పడేసింది. చంద్రం వచ్చినట్లున్నాడు. హాల్లో మాటలు వినబడుతున్నాయి. రేవతి వంటింట్లోకి నడిచి, రైస్ కుక్కర్ స్విచ్ వేసేందుకు చూసింది. టు ఇన్ వన్ ప్లగ్ కనిపించలేదు. దాని కోసం పక్కన షెల్ఫ్‌లో వెతికింది. అంతా కచ్చితమైన పద్ధతిలో సర్దిన వంటిల్లు. అన్నీ అందుబాటులో, వంటకు వీలుగా. ఇల్లంతటిలోనూ తన వంటిల్లు బావుంటుదంటుంది అమ్మ. ఎక్కడా మురికీ, జిడ్డూ లేకుండా ఇలా శుభ్రంగా ఉంటే చంద్రానికి ఇష్టం. ఒకే బిడ్డను కనడం, అతి లేకుండా నెమ్మదిగా నవ్వటం, డిగ్నిఫైడ్‌గా నడవటం, ఇవన్నీ అతని ఇష్టాలే. నేర్చుకొంది తను. ఒక్క పరుగులో వాకిట్లో పడ్డ పేపర్ అందుకోవటం, ప్రతి చిన్న జోక్‌కి పడీ పడీ నవ్వటం, ఆనందానికి, కోపానికీ విపరీతంగా స్పందించటం ఇలాంటి తన సహజ లక్షణాలన్నీ ఇవాళ లేవు. అమ్మే ఆశ్చర్యపోయింది. ఎంత బాగా తయారయ్యేవే అని... తప్పు, ఎంత బాగా తయారుచేశారే అనాలి. ఇప్పుడు తనెలా ఉంది? రేవతి కిటికీలోంచి బయటకు చూసింది. చిక్కుడు పాదు మీద గొంగళి పురుగు పాకుతోంది. చంద్రం చెప్పినట్లు నెమ్మదిగా, నమ్రతగా, పద్ధతిగా. అప్పుడప్పుడు తలెత్తి తనను తను చూసుకొంటోంది. అచ్చం తనను తాను గమనించుకుంటూ తీర్చి దిద్దుకొన్నట్లు. తృప్తిగా వెడుతోంది. తన లాగే... రేవతి చేతులకు టూ ఇన్ వన్ ప్లగ్ తగల్లేదు. ఇక్కడే వుండాలే. అది దొరికితే ఒకేసారి రైస్ కుక్కర్, గ్రైండర్ వాడుకోవచ్చు. తనను వంటింట్లోకి ఆఫీస్ పనులకు ఉపయోగించినట్లు. చంద్రం చేతుల్లో టు ఇన్ వన్ లేదా త్రీ ఇన్ వన్ తను. నైటీ తగిలిస్తే పడగ్గదిలో పెట్టవచ్చు.

శృంగారానికి పనికి వస్తుంది. వాయిల్ చీరకట్టి వంటింట్లో అమరిస్తే వంట వండేసి, పనులు చక్కబెడుతుంది. ఇస్త్రీ చీర కట్టి రిషా ఎక్కిస్తే పద్ధతిగా ఆఫీసుకు వెళ్ళి, తన కాబిన్‌లో ఏ వైరస్సూ సోకకుండా ఆఫీస్ పని చేసేస్తుంది. డబ్బూ తెస్తుంది... వారేవ్వా రేవతి చేతులకు ప్లగ్ దొరికింది. దాన్ని మూలకు విసిరికొట్టి డైరెక్ట్‌గా గ్రైండర్ ప్లగ్ అమర్చింది రేవతి. దడదడమని శబ్దం చేస్తూ గ్రైండర్ పనిచేస్తోంది. చంద్రం విసుక్కునే శబ్దం. చంద్రం లోపలకు వచ్చాడు.

''ఓ యూ వర్ హియర్. కోపం తగ్గిందా దేవీ....''

ముద్దు చేయబోయాడు.

''కోపం ఎందుకు...'' అన్నది అనవసరంగా గరిటెలు సర్దుతూ.

''చూశావా అనవసరంగా విసుక్కొన్నాను. అర్థం చేసుకోవూ... నీ సౌకర్యం కోసమే కదా... హాయిగా పని చేసుకొని పదింటికల్లా ఆఫీస్‌లో పడితే, ఐదింటికి గంట కొట్టినట్లు ఇంట్లో వుంటావు...''

''మరి ఆఫీసులో వర్క్ టెన్షన్ వుంటోందిగా. ఎంత కష్టపడుతున్నానూ. కొత్త జాబ్‌లో ఈ రిస్క్ ఉండదు. హాయిగా ఫీల్డ్ వర్క్. బోలెడు మంది సబార్డినేట్సూ...'' అంది చంద్రం వైపు చూస్తూ రేవతి.

చంద్రం మొహంలోకి మళ్ళీ కోపరేఖలొచ్చాయి.

''ఆ కేంపుల్లో, కాన్ఫరెన్సుల్లో, హోటల్లో ఒక్కదానివే ఉండాలి. కౌన్సిలింగ్ చేయాలి. నలుగురూ తలో మాటా అంటారు.''

రేవతి మొహం ఎర్రబడింది.

''తలోక మాట ఏమంటారూ? ఎందుకంటారూ. ఇదే మార్కెటింగ్ మేనేజర్‌గా వాసు పదేళ్ళ నుంచి పనిచేస్తున్నాడు. నెలకు ఇరవై వేలు సంపాదిస్తున్నాడు. అందరూ మెచ్చుకోవటంలే...''

''వాడు మగాడు...''

రేవతి చేతిలో గరిటలు విసిరికొట్టింది. గల్లుమని మోగుతూ వంటిల్లంతా పడ్డాయవి. వణికిపోతున్న శరీరాన్ని స్వాధీనంలోకి తెచ్చుకుందుకు ఒక్క నిముషం నిశ్శబ్దంగా ఊరుకుంది. ఉపకరణం.... పనిముట్టు... మనసు లోపలి నుంచి కెరటంలా తన్నుకొస్తోంది ఆవేశం... తను పనిముట్టు కాదు. ఆ విషయం చెప్పాలి. ఇప్పటికే ఆలస్యం అయింది. అంతే.

నేను ''రేపు కొత్త జాబ్‌లో చేరిపోతున్నాను...''

★

సుప్రభాతం

***20.11.1996***